# పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

- అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలు
- మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలి
- సిబ్బంది అంతా సమష్టిగా పనిచేయాలి
- ఏదైనా సమస్య తలెత్తితే తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబర్ 29 : పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం వికారాబాద్ మెరీనాట్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని, విధులను నిర్వహించే అధికారులందరూ సమష్టిగా పని చేయాలన్నారు. సామగ్రిని తీసుకెళ్లిన వెంటనే తమ పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను సమకూర్చుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే నోడల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. పోలింగ్ రోజున సిబ్బంది ఉదయం ఐదు గంటలకు కేంద్రాల్లో ఉండాలని, ఉదయం 5-30 గంటలకు మాక్ పోలింగ్ కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం సీఆర్సీ చేసి, వీ ప్యాట్‌ల నుంచి స్లిప్పులను తొలగించి మాక్ పోలింగ్ సర్టిఫికెటు ఇవ్వాలని తెలిపారు. ఉదయం ఏడు గంటలకు తప్పనిసరిగా పోలింగ్‌ను ప్రారంభించాలన్నారు. పోలింగ్ క్రమంలో రెండు గంటలకోసారి కచ్చితమైన రిపోర్టును ఇవ్వాలన్నారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఏమైనా సమస్యలు ఉంటే సెక్టోరల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉంటే ఎన్నికల కమిషన్ ఇచ్చిన హ్యాండ్ బుక్‌ను చదువుకుంటూ పని చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న వివిధ శాఖల సిబ్బంది కూడా అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను సాధారణ ఎన్నికల పరిశీలకులు సుధాకర్ పరిశీలించారు. కార్యక్రమంలో వికారాబాద్ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ, ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణ, స్వీప్ నోడల్ అధికారి మల్లేశం, పంచాయతీరాజ్ ఈఈ ఉమేశ్, జడ్పీ డిప్యూటీ సీఈవో సుభాషిణి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీవో సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



తాండూరు: పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది

**తాండూరు:** తాండూరు నియోజకవర్గంలో గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధిత అధికారులు బుధవారం సాయంత్రం వరకు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల నిర్వాహణ సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది తాండూరు పట్టణంలోని సెయింట్‌మార్క్స్ పాఠశాల నుంచి సంబంధిత అధికారులు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. తాండూరు అసెంబ్లీలో 269 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తాండూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. అందుల్లో మొత్తం 2 లక్షల 31 వేల 145 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఇందుల్లో స్త్రీలు 1,18,567 పురుషులు 1,12,572, ట్రాన్స్‌జండర్లు ఆరుగురు ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని, ఓటర్లు పోలింగ్ కేంద్రానికి ఏదైన ఒక గుర్తింపు కార్డును తీసుకొని సకాలంలో ఓటును వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవవన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని అధికారులు కోరారు.

**పెద్దేముల్ :** అసెంబ్లీ ఎన్నికలకు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆయా గ్రామాల్లో మొత్తం 46 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 38,807 మంది ఓటర్లు ఉండగా స్త్రీలు 19,812 మంది , పురుషులు 18,994 మంది, ట్రాన్స్‌జెండర్ ఒకరు ఉన్నారు. మండలంలో గాజీపూర్‌లో ఉమెన్ మ్యానెజుడ్ పోలింగ్ స్టేషన్, బుద్దారం గ్రామంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్ఐ ఎం.కాశీనాథ్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు కొనసాగుతున్నది.

**మోమిన్‌పేట:** మోమిన్‌పేట మండలంలో 48 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. బుధవారం సాయంత్రం ఎన్నికల అధికారులు ఈవీఎం, ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో మొత్తం 37,707 ఓట్లు ఉన్నాయి. పురుషులు 18,866, మహిళలు 18,641 ఉన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు 110 మంది పోలీస్ అధికారులు పని చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



తాండూరు: ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన సిబ్బంది

**కులకచర్ల:** కులకచర్ల మండలంలో 47 పోలింగ్ కేంద్రాలకు 188మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్లు మండల అదనపు ఎన్నికల అధికారి మురళీధర్ తెలిపారు. వీరితో పాటు ఐదుగురు అధికారులను అదనంగా కేటాయించినట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. చౌడాపూర్ మండలంలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల అదనపు పోలింగ్ అధికారి ప్రభు తెలిపారు. మండలంలో 29 పోలింగ్ కేంద్రాలకు గాను 116మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

**మర్పల్లి:** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మర్పల్లి, బంట్వారం మండలాల్లోని అన్ని గ్రామాలలో పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.. మర్పల్లి మండలంలో 58, బంట్వారం మండలంలో 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.. మర్పల్లి మండల కేంద్రంతో పాటు బిల్‌కల్ లో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని ఏర్పాట్లు చేశారు.



మోమిన్‌పేట : ఈవీఎం మిషన్లతో చేరుకున్న అధికారులు



మోమిన్‌పేట : బందోబస్తు కోసం వచ్చిన పోలీసు అధికారులు



పరిగి: పోలింగ్ సామగ్రి సరి చూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది



పరిగి: పోలింగ్ సామగ్రితో బస్సు ఎక్కుతున్న పోలింగ్ సిబ్బంది

## దివ్యాంగ ఓటర్ల కోసం ట్రై సైకిళ్ల పంపిణీ



బొంరాస్‌పేట, నవంబర్ 29 : గురువారం జరిగే పోలింగ్‌లో దివ్యాంగులు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల సంఘం ట్రై సైకిళ్లు పంపిణీ చేసింది. బొంరాస్‌పేట మండలానికి 18, దుద్యాల మండలానికి 14 ట్రై సైకిళ్లను సరఫరా చేసింది. వీటిని ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆర్ఐ రవిచారి బుధవారం పంపిణీ చేశారు. దివ్యాంగ ఓటర్లు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులను ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లడానికి ట్రైసైకిళ్లను వినియోగిస్తారు. ట్రై సైకిళ్లు వెళ్లడానికి అనువుగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులను కూడా నిర్మించారు.

## బీఆర్ఎస్‌లో చేరిన యువకులు



కులకచర్ల, నవంబర్ 29: మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన బేగరి సాయికృష్ణ తదితరులు బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కడంపల్లి రఘు, మంచమోని గోపాల్, శ్రీధర్, సుదర్శన్‌కుమార్, గజ్జి వెంకటయ్య, కొత్త వెంకటయ్య, సీమ బాలకిష్టయ్య, ఎర్రగొళ్ల బిచ్చన్న, వడ్డె సంజప్ప, వడ్డె కృష్ణ, మాల బాబు, సంపంగి గోపాల్, ఎత్తరి రాజు, ఇందూరు శ్రీనివాస్, వంక మల్లేశ్ పాల్గొన్నారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, Antharam Village కి చెందిన Vislavath Devi W/o Daggula Kishnaiah, aged 29 years, Occ: Business, R/o H.NO.2-11, Antharam Village,Kulkacherla Mandal, Vikarabad Dist. **Applicant / Borrower** నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, జడ్చర్ల బ్రాంచ్ గారికి ఇట్టి ఆస్తిని తనఖా (Mortgage) పెట్టి అప్పు తీసుకోవటానికి దరఖాస్తు చేసియున్నారు. ఇట్టి ఆస్థి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల ఈ క్రింది అడ్రస్సుకు (3) రోజుల లోపల తెలియ జేయగలరు. లేని పక్షంలో ఇట్టి ఆస్తిపై ఎలాంటి అభ్యంత రములు లేవని భావించి నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, జడ్చర్ల బ్రాంచ్ వారు షెడ్యూల్డ్ ఆస్తిని తనఖా పెట్టుకొని అప్పును మంజూరు చేయుదురు. తరువాత వచ్చిన ఆక్షేపణలు చెల్లనేరవు.

**SCHEDULE OF THE PROPERTY:**

H.No.2-16/1 RCC plinth area 869.04 Sq.fts., total extent 152 Sq.Yards, situated within the limits of Antharam Village, Kulkacherla Mandal, Vikarabad Dist.**Bounded by:** **East:** Road, **West:** Open Place, **North:** Road, **South:** House of Daggula Venkatamma.

**K. CHANDRA MOULI,** B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar,
Mahabubnagar. Cell: 9440330760